కథ

# అమ్మమ్మ కథ

కర్లపూడి విజయలక్ష్మి

పొద్దువాలింది. కెంజాయ రంగుతో సంధ్యాసుందరి తన అందానికి మెరుగులు దిద్దుకుంటోంది.

మా పెద్దమ్మాయి విజయ కొడుకు నాని. ఎర్రగా ముద్దుగా..బొద్దుగా వుంటాడు. మూడున్నర సంవత్సరాల నాని ముద్దు మాటలు మమ్మానందింప చేస్తాయి. స్నానం చేసి చక్కగా తయారయి బుద్ధిగా గేట్ మెట్టు మీద కూచుని వచ్చీపోయే వాహనాల్ని తన్మయత్వంతో చూస్తున్న వాడు..విల్లు విడిచిన బాణంలా రివ్వున లోపలికి దూసుకొచ్చాడు.

ఆ సరికే వాడి అక్క మాధవీ, ఆరేళ్ళది తమ్ముడు రెండేళ్ళ చిన్నీకి స్నానాలు ముగించి డ్రస్ వేసి..పౌడర్ రాస్తున్నాను.

"అమ్మమ్మా..అమ్మమ్మా..మరేమో" ఆగాడు.

"ఏవిట్రా..ఎందుకలా పరిగెత్తుకొచ్చావు? ఆవులేమైనా చొరబడుతున్నాయా?" కాంపౌండు గేటు తీసి వుండటం వల్ల చేతిలో పని ఆపకుండానే అనుమానంగా అడిగాను.

"ఊహు..ఆవులు కాదు..అమ్మమ్మా..మరేమో..పోలీస్ లేడు..పోలీస్.."

"పోలీసా..పోలీస్ ఎందుకొచ్చినట్టు?" వాడ్ని మధ్యలోనే అడ్డుకున్నాను ఆశ్చర్యంతో.

"పోలీసు లాలేదు" చిరాగ్గా కొట్టినట్టు చెప్పాడు.

"అబ్బా..ఆవులు రాలేదంటావు. పోలీసు రాలేదంటావు. మరి నువ్వు లోపలికెందుకు పరిగెత్తుకొచ్చావురా? నాన్చి చంపక అసలు విషయం చెప్పు" చేతిలో పని ముగియగానే వాడివైపు తిరిగి వినుక్కున్నాను.

"గేటులో వున్న నన్ను చూసి..నన్ను చూసి" ఆగాడు.

"ఊ...నిన్ను చూసి..అసలేం జరిగిందో త్వరగా చెప్పరా నాయనా" కోపంగా అన్నాను.

"నన్ను చూసి పోలీసు భయపడి పారిపోయాడు" రెండు చిట్టి చేతులతో చప్పట్లు కొడుతూ బంతిలా ఎగురుతూ కేరింతలు కొడుతున్నాడు. అది చూసి మాధవీ..చిన్ని కూడా చప్పట్లు కొడుతూ ఎగురుతున్నారు.

వాడు చెప్పింది నాకేమీ అర్థం కాలేదు. పోలీసు వీడ్ని చూసి పారిపోవటం ఏంటో బొత్తిగా అర్థం కాలేదు.

"పోలీసు నిన్ను చూసి పారిపోటం ఏంటి? అసలేం జరిగిందిరా?" అడిగాను.

"అవునమ్మమ్మా చైకిలెక్కి మన గేటు వలకు వచ్చాడు. కూచున్న నన్ను చూశాడు. అంతే చైకిలు ఎనక్కి తిప్పుకొని సీడ్‌గా వెల్లిపోయాడు" మళ్ళీ గంతులు మొదలెట్టాడు.

ఇంతలో విజయ..పద్మ..దుర్గ..మా ముగ్గురమ్మాయిలు అక్కడికొచ్చి విషయం విని "అక్కడికి రాగానే ఆ కానిస్టేబులికి ఏదో పని గుర్తొచ్చి వుంటుంది..వెంటనే వెనక్కి తిరిగి వెళ్ళిపోయుంటాడు" అన్నారు.

"ఊహు..కాదు నన్ను చూసే భయపడి పాలిపోయాడు" అన్నాడు నాని తను చెప్పిందే కరెక్ట్ అన్నట్టు వాదిస్తూ.

ఆ పోలీసు ఎందుకైనా వెనక్కి తిరిగి వెళ్ళనీ నాని తనని చూసి భయపడి పారిపోయాడనుకొని చెప్పటం మాత్రం మా అందరికీ నవ్వు తెప్పించింది. పడీ పడీ నవ్వాము.

నాని ఘనతకి అక్క తమ్ముడు కూడా నవ్వారు.

పోలీసు అనగానే గతంలో నా అనుభవమొకటి గుర్తొచ్చింది.

"నానీ! ఇంత చిన్న పిల్లాడివి నిన్ను చూసి పారిపోయిన పోలీసు అంత పెద్దాడు మీ తాతయ్యని చూసి భయపడి పారిపోలేదు సరికదా పట్టుకెళ్ళిపోయాడు" మొహం అదోలా పెట్టి అన్నాను.

"నాన్నని పోలీస్ పట్టుకెళ్ళటం ఏంటమ్మా?" ఆశ్చర్యంగానూ అయోమయంగానూ అడిగారు ముగ్గురూ ఒక్కసారిగా.

"అమ్మమ్మా తాతయ్యని పోలీస్ పట్టుకెళ్ళాడా?" మాధవి కళ్ళు పెద్దవి చేసి వింతగా అడిగితే.."మలి అమ్మమ్మా అప్పుడు నన్ను పిలవకూడదు...పోలీసు నన్ను చూసి పాలిపోయేవాడు" అన్నాడు తనని చూసి పోలీసు బాగా భయపడుతున్నాడని గట్టిగా నమ్మిన నాని.

తాతయ్యని నేను రక్షించే వాడిని అని అర్థం వచ్చేలా మాట్లాడిన వాడి ముద్దు మాటలకి నవ్వాగలేదు.

"ఏంటమ్మా ఏం జరిగిందో చెప్పకుండా నవ్వుతావేంటి? అసలు ఈ విషయం మాకెప్పుడూ చెప్పలేదేంటి?" గుచ్చి గుచ్చి అడిగారు.

ఆ సంఘటన గుర్తురాగానే నా మొహంలో ఫీలింగ్స్ మారిపోయాయి. అది ఎప్పుడో జరిగినా దాని తాలూకు భయం నా కళ్ళల్లోకి వచ్చి చేరింది.

"అప్పుడు మీరు బాగా చిన్నపిల్లలు. స్కూలికెళ్ళారు పనంతా ముగించుకొని 'పేపర్ చూస్తూ కూచున్నాను' గతంలోకి చూస్తున్నట్టుగా అన్నాను.

ఇంతలో...

నాలుగిళ్ళవతలుండే సుబ్బారావు బాబాయి పరిగెత్తుకొచ్చాడు.

"అమ్మాయి మీనాక్షీ..మీనాక్షి ఘోరం జరిగిపోయిందమ్మా" రొప్పుతూ అన్నాడు.

ఒక్కసారిగా నాలో భయం. ఆందోళన చోటు చేసుకోగా "ఏం జరిగింది బాబాయిగారూ?" ఘోరం అన్న మాటకి నా మనసులో పలురకాల ఆలోచనలు గజిబిజిగా అల్లుకుంటున్నాయి.

"శంకర్రావుని ఇద్దరు పోలీసులు తీసికెళ్తున్నారమ్మా" అన్నాడు ఆందోళనగా.

"ఆయన్ని పోలీసులు తీసికెళ్ళటం ఏంటి బాబాయ్. మీరు ఎవర్ని చూసి ఎవరనుకుంటున్నారో..మీరు సరిగ్గా చూశారా? ఆయన ఆఫీస్‌కెళ్ళి గంటన్నర అవుతోంది!" అన్నాను ఏవీ అర్థంకాక.


"అదేంటమ్మా ఏడేళ్ళుగా ఈ వీధిలోనే వుంటున్నారు. అబ్బాయి నాకు తెలీనట్టు మాట్లాడతావేంటి?" అన్నాడు గట్టిగా తను చూసింది నా భర్త శంకర్రావునే అన్నట్టు.

అదీ నిజమే కదా! నా అమాయకత్వం కాకపోతే సరిగ్గా చూశారా? అంటానేంటి? జరగాల్సింది జరిగిపోయింది.

"ఇంతకీ ఏం జరిగింది బాబాయ్" అన్నాను. అసలేం జరిగి వుంటుందో ఊహించటానికి ప్రయత్నిస్తూ. కానీ ఎంతకీ ఏం జరిగిందనేదే నా బుర్రకి అందటం లేదు.

"అసలు ఏం జరిగిందో నాకూ తెలీదమ్మా. నువ్వు ఏవీ అనుకోనంటే నేచూసిన దాన్ని బట్టి అనుకున్న విషయం చెబుతానమ్మా..శంకర్రావు ఆఫీసులో ఏదో దొంగతనం లాంటిది చేసివుంటాడనుకుంటున్నాను" ఇంకా ఏదో చెప్పబోయాడు. గయ్యిమన్నాను.

"ఇహ చాల్లే ఆపండి. మంచికి..నీతి నిజాయితీలకి



మారుపేరు. ఆయన దొంగతనం చేయటం ఏంటి? ఆయనకి డబ్బు వ్యామోహమూ లేదు అంత డబ్బు అవసరాలు మాకు లేవు. ఇదేనా ఇన్నేళ్ళలో ఆయన గురించి మీరు తెలుసుకున్నది" ఇంకా ఏదో అనబోతున్న నన్ను అడ్డుకుంటూ.

"నా కళ్ళతో చూసినదాన్నిబట్టి అని ముందే చెప్పాను కదమ్మా...అబ్బాయి ఏదో ఎర్రటి డబ్బు సంచీలాంటిది రెండు చేతులతో గుండెలకి గట్టిగా అదిమిపెట్టుకొని నడుస్తున్నారు. అతనికి చెరోవైపు ఇద్దరు పోలీసులు తుపాకీలు పట్టుకొని నడుస్తున్నారు. నేనే కాదు అక్కడ వున్నవారంతా శంకర్రావు ఏదో నేరం చేసే వుంటాడని ఏదేదో చెప్పుకొంటున్నారు" అన్నాడు తన తప్పేమీ లేదన్నట్టు.

చెమటతో వొళ్ళంతా తడిసి ముద్దయ్యింది. ఆయన అంతిదిగా చెబుతున్నాడంటే ఖచ్చితంగా ఏదో జరిగే వుంటుంది. కొద్దిసేపు ఏం చేయాలో తోచలేదు. ఇళ్ళల్లో మగాళ్ళెవరూ లేరు. అంతా ఆఫీసులకెళ్ళిపోయారు.

"బాబాయ్ పోలీస్‌స్టేషన్‌కెళ్దాం నాక్కాస్త సాయంగా వస్తారా?" అడిగాను వాస్తవంలోకొస్తూ.

"నేనా? పోలీస్ స్టేషన్‌కా?" కాస్త భయంగా చూశాడు.

నాకూ చచ్చేంత భయంగా వుంది. కానీ ఏం చేయను అక్కడ వున్నది నా భర్త. తప్పదు. మరో దారి లేదు. అందుకే ఈ మొండి ధైర్యం.

ఆయన కళ్ళల్లో రెపరెపలాడుతున్న భయాన్ని కనిపెట్టి "దీనికీ మీకూ ఏ సంబంధమూ లేదు. నేనే అంతా మాట్లాడతాను. కేవలం మీరు తోడుగా వస్తే చాలు. ప్రక్కన మీరుంటే నాకు ధైర్యంగా వుంటుంది" అన్నాను ఆయనకి హామీ ఇస్తూ.

ఇంట్లో మావారితో లొడలొడ మాట్లాడ్డం తప్ప నలుగురు ఆడవాళ్ళ మధ్య కూడా నోరు విప్పలేని నేను అంతా నేనే మాట్లాడతాను అనటం అదీ పోలీస్‌స్టేషన్లో..నాకే వింతగానూ..ఆశ్చర్యంగానూ వుంది. మన చుట్టూ ఉన్న పరిస్థితులే మనలో ధైర్యాన్ని..తెగింపుని కలిగిస్తాయేమోననిపించింది.

ఇద్దరం స్టేషన్‌కెళ్ళాము. ఎస్సైని చూస్తూనే...

"సార్! మా వారు చాలా మంచివారు. నిజాయితీ పరులు సార్. మీ కానిస్టేబుల్స్ ఏదో పొరబడి వుంటారు. మా వారిని విడిచిపెట్టండి సార్. ఆయనలాంటి వారు కాదు సార్..ఇన్నేళ్ళలో ఆయన చిన్న పొరబాటు కూడా చేయలేదు సార్" ఎస్సైని బ్రతిమాలాను.

"....."

"సార్! శంకర్రావుగారు చాలా మంచివారు సార్. మా వీధిలోనే ఏడేళ్ళుగా వుంటున్నారు. కనీసం ఇరుగు పొరుగులతో కూడా గట్టిగా మాట్లాడి ఎరుగరు. చాలా సౌమ్యులు. అంతా చిన్న పిల్లలు సార్" పాపం స్టేషన్ అనగానే భయపడిన బాబాయి కూడా ధైర్యంగా బ్రతిమాలటం మొదలెట్టాడు.

ఆ ఎస్సై తెల్లమొహం వేసుకొని..అయోమయంగా మా ఇద్దర్నీ మార్చి మార్చి చూశాడు. మేం చెబుతున్నది తలా తోకా లేని అర్థంకాని కథలా వుందేమో..క్వశ్చన్ మార్క్ ఫేస్‌తో చూశాడు.

"మీవారిని అరెస్ట్ చేశామని మీరు అపోహ పడుతున్నారు. కానీ ఈరోజు మేమెవరిని అరెస్ట్ చెయ్యలేదు. కావాలంటే చూసుకోండి. సెల్ వారం రోజులుగా ఖాళీగా వుంటోంది. మీకెవరో రాంగ్ ఇన్ఫర్మేషన్ ఇచ్చారు" అన్నాడు చాలా పొలైట్‌గా.

ఇంకానయం చాలా మర్యాదగా చెప్పాడు. నా వాగుడు చూసి ఏ పిచ్చాసుపత్రి బాపతో అనుకోలేదు. నిజమే కంగారులో గమనించలేదు. సెల్ ఖాళీగానే వుంది. మరేంటి బాబాయి అలా చెప్పారు? మనసు పీకుతోంది.

"థాంక్యూ సార్..థాంక్యూ వెరీమచ్..చల్లని మాట చెప్పారు" అన్నాను సగం భారం దిగిపోయిన దానిలా. కానీ పోలీస్టేషన్ నుంచి అంత త్వరగా బయటపడతాననుకోలేదు. అది కొంత ఆనందం కలిగించింది.

రోడ్ మీదికి రాగానే "అమ్మా! ఓసారి ఆఫీసుక్కూడా వెళ్ళి కనుక్కుందాం" ఇంకా అనుమానం తీరక అన్నారు బాబాయి.

నిజమే కదా! అక్కడికెళ్తే అన్ని విషయాలు వివరంగా తెలుస్తాయి..అనుమానాలు తీరిపోతాయి. ఆయన్ని ఓసారి కళ్ళారా చూడాలన్న తహతహ నాలోను ఎక్కువైంది. "సరే బాబాయి" అన్నాను.

ఇద్దరం రిక్షాలో ఆఫీస్‌కి చేరుకున్నాము.

సరాసరి పోస్ట్‌మాస్టర్ ఛాంబర్‌లోకి వెళ్ళి "సార్..ఈరోజు ట్రెజరర్‌గా ఛార్జీ తీసుకున్న శంకర్రావుగారి వైఫ్‌ని. పోలీసులు ఆయన్ని అరెస్ట్ చేసి తీసికెళ్ళినట్టు తెల్సింది. కానీ వాళ్ళెవర్నీ అరెస్ట్ చేయలేదంటున్నారు. నాకు చాలా భయంగా వుంది సార్. ఆయన చాలా మంచివారు. ఆయన ఏ తప్పూ చేసి వుండరు. ఏదో పొరబాటు జరిగి వుంటుంది" బావురుమని ఏడ్చేశాను.

"చూడమ్మా శంకర్రావుగార్ని అరెస్ట్ చేశారని మీకెవరు చెప్పారు?" ఆయన తాపీగా కళ్ళజోడులోంచి చూస్తూ అడిగారు.

అసలు విషయం ఏంటో తెలీక స్టాఫంతా పనాపి క్యూరియస్‌గా ఛాంబర్ వైపు దృష్టి సారించారు.

'ఎవరు చూశారు. ఎప్పుడు చెప్పారు అదా ఇప్పుడు ముఖ్యం' మనసులోనే తిట్టుకొని "మా బాబాయి చూశార్ట..చెప్పారు"

"ఏం సార్. మీరేం చూశారు?" బాబాయి నుద్దేశించి అడిగి ఆయన్ని పరిశీలనగా చూడసాగారు.

"శంకర్రావుగారు సంచిని రెండు చేతులతో గుండెకి అదిమిపెట్టుకుని బిక్కుబిక్కుమంటున్నారు. ఇద్దరు పోలీసులు తుపాకులు పట్టుకుని చెరొక వైపు నడుస్తున్నారు. అదే నేను అమ్మాయితో చెప్పాను" అన్నాడు.

ఆయన ఫకాలున నవ్వి "చంపారు పొండి. అది చూశా మీరు ఈ అమ్మాయిని అంతగా హడలెత్తించారు" తేలిగ్గా నిట్టూరుస్తూ అన్నారు.

మాష్టారెందుకు నవ్వారో మాకు అర్థంకాక నేను, బాబాయి అయోమయంగా ఒకరి ముఖాలు ఒకరం చూసుకున్నాము.

"చూడండమ్మా..మా ఆఫీసువర్కు గురించి మీకు ఏమీ తెలీదు. చుట్టుపక్కల వున్న బ్రాంచీ ఆఫీసుల నుండి ఏరోజుకారోజు వచ్చిన ఎమౌంట్సుని ఎప్పటికప్పుడు బ్యాంకులో జమెయ్యాలి. మా ఆఫీసు ఎక్కౌంట్సులో ఇరవై వేలు దాటితే మా ఆధీనంలో వుంచుకోకూడదు. ఆ నిమిత్తం బ్యాంకుకు వెళ్ళేందుకు పోలీస్ సెక్యూరిటీ తీసుకుంటాము. ఇవన్నీ గవర్నమెంట్ రూల్సు..మరి మేం వాటిని ఫాలో అవ్వాలికదా! అలా జమెయ్యడానికి బ్యాంకుకు బయలుదేరిన శంకర్రావుగారిని చూసి అసలు విషయం తెలీక పాపం ఈయన అలా అపార్థం చేసుకొని ఆయన భయపడిపోయి మిమ్మల్ని హడలుగొట్టారు" అసలు విషయాన్ని వివరించారు.

వర్కింగవర్స్‌లో ఆయన్ని ఇబ్బంది పెట్టినందుకు సారీ చెప్పి...గుండెల్లో భారం పూర్తిగా దిగిపోగా..బాబాయి వేపు చూశాను ఆఫీసులోంచి రోడ్‌మీదకొచ్చి.

నా చూపుని ఆయన ఎలా అర్థం చేసుకున్నారో.."నాకు నిజంగా ఈ సంగతులేమీ తెలీవమ్మా..అందుకే అలా అర్థం చేసుకుని కంగారుపడివచ్చి నిన్ను కూడా గాబరా పెట్టేశాను" అన్నారు జరిగినదానికి సంజాయిషీ ఇస్తున్నట్టు.

"ఇందులో మీ తప్పేమీలేదు బాబాయ్. అసలు విషయం తెలీనివారు ఎవరైనా అలానే అనుకుంటారు. ఏది ఏమైనా మీరు మా శ్రేయోభిలాషులు. అందు ఆయనకోసం అలా అదుర్దాపడ్డారు. నాతోపాటే మీరు పోలీస్‌స్టేషన్‌కి..ఆఫీసుకి వచ్చారు. మీకు నా కృతజ్ఞతల ఎలా తెలియజెయ్యాలో తెలీటం లేదు" తేలికపడి మనసుతో మనస్ఫూర్తిగా చెప్పాను.

మాష్టారి ద్వారా విషయం తెలుసుకొని గంట పర్మిష పెట్టి ఇంటికి వచ్చిన మీ నాన్న నా అమాయకత నికి...భయానికి పొట్ట చెక్కలయ్యేట్టు పడీ పడీ నవ్వార అంతేకాదు ఈ విషయం అమ్మమ్మకి తాతయ్యకి కూ చెప్పి నన్ను ఆటపట్టించేవారు. ఆ నవ్వు చూస్తోంటే నాక మాత్రం పిచ్చికోపం వచ్చేది. నా భయం నాది. అది ఆయ నకి అర్థం కాదు.

ఆ సమయంలో నేను పడిన భయం..ఆందోళన..నేన నుభవించిన మానసిక వ్యధ అప్పటి పరిస్థితిలో న్యాయమే అయినా ఆ సంఘటన సుఖాంతం అయ్యింది కనుక తర్వాత ఆ సంఘటన తలుచుకుంటే నాకు ఇప్పటికీ నవ్వు తన్నుకొస్తుంది" అన్నాను పెదవుల మీద నవ్వు విరియగా.

కూతుళ్ళు ముగ్గురూ పొట్ట పట్టుకొని మరీ నవ్వారు. సరిగా అర్థం కాకపోయినా మాధవీ..నాని నవ్వారు. అందరూ నవ్వుతోంటే అసలు ఏమీ అర్థం కాని పసివెధవ చిన్నీ కూడా కేరింతలు కొడుతూ నవ్వాడు.

అమ్మో! పోలీసని హడలిపోయిన నాకూ...తనని చూసి పోలీసే భయపడి పారిపోయాడని గట్టిగా చెబుతున్న నా మనవడికీ.. తెలివిలోనూ, ధైర్యంలోనూ ఎంత వ్యత్యాసం. ఈ జనరేషన్ అంతేనేమో- నదురు బెదురు ఏమాత్రం లేదు. పైగా మితిమీరిన తెలివి.

నాలాగా పోలీసుని చూసి బెదరకపోవటం నాకానం దాన్ని కలిగించింది. వాడి అమాయకత్వంతో కూడిన ధైర్యానికి, వాదనకి, ముద్దుమాటలకి మురిసిపోతూ మృదువైన వాడి పాలబుగ్గలని సున్నితంగా ముద్దాడాను.

★

